
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 13 మార్చి 2024 | 5



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	సా.6.21
సహరి (గురు)	ఉ.4.51

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
కాకినాడ	34.9	24.1



216వ జాతీయ రహదారిలో పిఠాపురం బైపాస్ రోడ్డుపై అవరించిన పొగమంచు

అటు వీడని పొగమంచు.. ఇటు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

భిన్న వాతావరణంతో ఉక్కిరిబిక్కిరి... పలు అనారోగ్య సమస్యలతో సతమతం

పిఠాపురం, మార్చి 12: వేసవి ప్రవేశించినా పొగమంచు ప్రభావం వీడడం లేదు. ఉదయం 9 గంటలకు కూడా మంచు కురుస్తూనే ఉంటోంది. ఇటు పగటిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. పగలు, రాత్రి సమయాల్లో నెలకొంటున్న భిన్నవాతావరణ పరిస్థితులు ప్రజలను ఉక్కిరిబిక్కిరిచేస్తున్నాయి. రాత్రితోపాటు ఉదయం పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయానికి రహదారులు, పంటపొలాలపై పొగమంచు ప్రభావం తగ్గలేదు. కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయరహదారిలో పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు బైపాస్‌రోడ్డులపై, పంటపొలాలు మంచు ఆవరించి ఉంది. పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకి అధికమవుతున్నాయి. ఎండతీవ్రత, ఉక్కపోత పెరుగుతోంది. అదే సమయంలో రాత్రయ్యేసరికి చలి వాతావరణం నెలకొంటోంది. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9గంటల వరకూ పొగమంచు కురుస్తోంది. ఈ భిన్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పొగమంచు ప్రభావం వల్ల ఉదయమే బయటకు వస్తే తుమ్ములు అధికమై జలుబు, దగ్గు వస్తోందని పలువురు చెబుతున్నారు. ఈ వాతావరణ మార్పులతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇన్నాళ్లకు గుర్తొచ్చాయా!



పూర్తికాకుండానే కాకినాడలో ప్రారంభించిన ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం

- అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డ వేళ జిల్లాలో అధికార పార్టీ నేతల సిత్రాలు
- ఇన్నేళ్లుగా గాలికి వదిలేసిన పనులకు హడావుడిగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- పూర్తవకుండానే జిల్లాలో నాడు-నేడు పాఠశాలలు, సచివాలయ భవనాలు, హెల్త్ సెంటర్లు, వాటర్‌ట్యాంకులకు రిబ్బన్ కటింగ్‌లు
- కాకినాడలో అసంపూర్తిగా ఉన్న స్కేటింగ్‌రింక్, పార్కులు, ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం సైతం ప్రారంభం
- ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనాలను కొన్నేళ్లుగా గాలికి వదిలేసిన మంత్రి రాజా
- తీరా ఇప్పుడు ఎన్నికల ప్రచారం కోసం ప్రారంభోత్సవాల కలరింగ్
- మరోపక్క నిధుల్లేకుండానే రోడ్లు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లకు నిస్సిగ్గుగా శంకుస్థాపనలు

అసెంబ్లీ ఎన్నికల ముహూర్తం దగ్గరపడ్డంతో జిల్లాలో అధికార పార్టీ నేతల హడావుడి అంతా ఇంతా లేదు. రోజుకో రకమైన సిత్రాలతో జనాలను మభ్యపెట్టేందుకు తంటాలు పడుతున్నారు. నియోజకవర్గాల్లో వరుస ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో హంగామా సృష్టిస్తున్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చేసినట్టు, చేయనివీ చేసేసినట్టు ప్రచార కలరింగ్ ముమ్మరం చేస్తున్నారు. అనేక పనులు పూర్తవకపోయినా చేసేసినట్టు పైపై మెరుగులతో రిబ్బన్ కటింగ్‌లు చేస్తూ జనాలను మభ్యపెట్టేందుకు పోటీపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఈ అయిదేళ్లలో అనేక పనులు నిధులు లేక మూలనపడ్డా ఏనాడు ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. తీరా ఇప్పుడు ఎన్నికలు రావడంతో అవన్నీ పూర్తయిపోయినట్టు నమ్మించేందుకు ప్రారంభోత్సవాలు చేస్తుండడం నవ్వులపాలయ్యేలా చేస్తోంది. అందులోభాగంగా సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, వాటర్ ట్యాంకులు, నాడు-నేడు అదనపు తరగతి గదులు, పార్కులు ఇలా అనేక పనులు ఇంకా పూర్తవకపోయినా ప్రారంభించేస్తూ హడావుడి చేస్తున్నారు. తునిలో మంత్రి రాజా అయితే మరో అడుగు ముందుకేశారు. ఎప్పుడో కొన్ని భవనాలు పూర్తయినా పక్కన పడేశారు. ఎన్నికల ప్రచారం కోసం ఇప్పుడు తీరిగ్గా వాటికి ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. మరోపక్క రేపోమాపో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో కావని తెలిసినా జిల్లాలో అనేకమంది ఎమ్మెల్యేలు ఏకంగా కొత్త పనులకు శంకుస్థాపనలు సైతం చేస్తుండడం మరొక విడ్డూరం.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో అభివృద్ధి పూర్తిగా పడకేసింది. నవరత్నాల పేరుతో లబ్ధిదారులకు బటన్ నొక్కుడు మినహా ప్రజలకు అవసరమైన ఏ పనులు జగన్ సర్కారు చేయలేదు. అధికారంలోకి వచ్చీరాగానే నిధుల కొరతతో అనేక అసంపూర్తి పనులను పక్కన పెట్టేసింది. తీరా నవరత్నాల కింద సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు, నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంకులు ఇలా అనేక పనుల నిర్మాణం ప్రారంభించినా నిధుల కొరతతో అవన్నీ మూడేళ్లుగా మధ్యలోనే ఆగిపోయాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మరికొన్ని పనులు ఎనభై శాతం పూర్తయినా బిల్లులు ఆగడంతో అవీ మూలనపడ్డాయి. అయినా వైసీపీ ఎమ్మెల్యేలు ఏ రోజు వీటి గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి పూర్తిచేసేందుకు ప్రయత్నించలేదు. తీరా ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డంతో ఎమ్మెల్యేలు పరుగులు తీస్తున్నారు. వీటిని ప్రారంభించకపోతే ఎక్కడ ఓట్లు రావోననే భయంతో వాటిపై దృష్టి పెట్టారు. ఇప్పుడు రిబ్బన్ కట్ చేయకపోతే ఒకవేళ కొత్త ఎమ్మెల్యేలు వచ్చి ఆ ఛాన్స్ కొట్టేస్తారనే భయంతో ఎడాపెడా కొన్ని రోజులుగా ప్రారంభించేస్తున్నారు. దీంతో జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు ప్రారంభోత్సవాల తంతు కొనసాగిస్తున్నారు. పోనీ ఇవన్నీ నిజంగా పూర్తయ్యాయా అంటే అదీ లేదు. నిధుల కొరతతో అసంపూర్తిగా ఉన్నా పైపై మెరుగులతో ముసుగేసి రిబ్బన్‌లు కత్తిరించేస్తున్నారు. కాకినాడ సిటీలో గతనెల్లో ఎమ్మెల్యే ద్వారంపూడి ఇండోర్ స్కేటింగ్ రింక్ ప్రారంభించారు. తీరా దీనికి సంబంధించి ఇంకా అనేక పనులు చేయడానికి అధికారులు ఇంకా టెండర్లు పిలుస్తూనే ఉన్నారు. కాకినాడ రూరల్‌లో రూ.20 కోట్లతో నిర్మించిన కన్వర్టబుల్ స్టేడియం, సురేష్‌నగర్ పార్కును ఇటీవల ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభించారు. ఇవన్నీ కొన్నేళ్లుగా మూలనపడి ఉన్నాయి. తీరా ఎన్నికలు సమీపించడంతో సిద్ధమైపోయిందనే ముసుగేసి రిబ్బన్ కట్ సేసేశారు. ఇందులో అనేక అసంపూర్తి పనులు పూర్తిచేయడానికి అధికారులు ఇంకా టెండర్లు పిలుస్తున్నారు. బీచ్‌రోడ్డులో యుద్ధవిమాన మ్యూజియం పనులు అసలింకా పూర్తికాలేదు. కానీ రిబ్బన్ కట్ చేసేశారు. జగన్నాథపురంలో పలు వార్డుల్లో 1,175మంది లబ్దిదారులకు ఇళ్లు నిర్మించని ఎమ్మెల్యే ద్వారంపూడి తనను మళ్లీ గెలిపిస్తే 18 నెలల్లో ఇళ్లు కట్టిస్తానంటూ తాజాగా గాలి వాగ్దానాలు చేశారు. పెద్దాపురంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొరబాబు రూ.22 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ప్రత్తిపాడు మండలం గర్జనపూడిలో సచివాలయ భవనాలు, రక్షిత మంచినీటి పథకాలు కొన్నేళ్లుగా పడకేయగా పట్టించుకోని ఎమ్మెల్యే తాజాగా వీటిని హడావుడిగా ప్రారంభించారు. తునిలో మంత్రి రాజా ప్రచారంలో మరో అడుగు ముందుకేశారు. తుని పట్టణం, రూరల్ పరిధిలో ఆరు సచివాలయాల భవనాలు, హెల్త్‌సెంటర్, నాలుగు కమ్యూనిటీ భవనాలు, మూడు ఆర్బీకేలు కొంతకాలం కిందట పూర్తయినా వాటిని వినియోగంలోకి తేకుండా ఖాళీగా ఉంచారు. తీరా ఇప్పుడు రేపోమాపో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ప్రచారం కోసం ఇప్పుడు ప్రారంభించారు. రౌతులపూడి, తాళ్లరేవులో అనేక నాడు-నేడు ఆసుపత్రి భవనాలు, సచివాలయాలు, సామాజిక ఆసుపత్రి భవనాలు, ఓవర్‌హెడ్‌ట్యాంకులు ఇంకా పూర్తికాకపోయినా ఇటీవల అక్కడ ఎమ్మెల్యేలు రిబ్బన్‌లు కట్ చేసేశారు. ఇలా ఎక్కడికక్కడ కొన్నేళ్లుగా వీటి జోలికి వెళ్లకుండా వదిలేసిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎన్నికల ప్రచారం కోసం వీటిని ఎంచక్కా వాడేసుకుంటున్నారు. పూర్తవకపోయినా అయిపోయినట్టు పెయింట్లు వేసి రిబ్బన్‌లు కట్ చేసేస్తున్నారు. తీరా వీటిని వాడాలని ఆయా శాఖలు భావిస్తే లోపల కనీసం ఎలక్ట్రికల్ వర్కులు కూడా జరగక నోరెళ్లబెడుతున్నారు. మరోపక్క అసంపూర్తిగా ఉన్న పనులను ఎలాగైనా ప్రారంభించడం కోసం ఎమ్మెల్యేలు స్థానిక అధికారులపై ఇటీవల విపరీతంగా ఒత్తిడి తెస్తున్నారు. ఏదోలా కాంట్రాక్టర్‌ను పిలిపించి పూర్తిచేయించాలని ఆదేశిస్తున్నారు. తీరా బిల్లులు బాకీ ఉందని వివరిస్తే పైపైన పెయింట్‌లు వేసినా చాలని చెప్పి తూతూ మంత్రంగా పనులు అయిందనిపించి ప్రారంభోత్సవాలు చేసేస్తుండడం విశేషం.



కాకినాడ రూరల్‌లో ఇటీవల ప్రారంభించిన కన్వర్టబుల్ స్టేడియం

లేని నిధులకు శంకుస్థాపనలా...

ఒకపక్క నిధుల కొరతతో జిల్లాలో అనేక పనులు, భవనాలు మధ్యలోనే నిలిచిపోయి వైసీపీ ప్రభుత్వాన్ని వెక్కిరిస్తున్నాయి. త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో వీటికి నిధులు రావడం కూడా అసాధ్యం. వీటికే దిక్కులేదంటే జనాలను మభ్య పెట్టడానికి వైసీపీ ఎమ్మెల్యేలు ఏకంగా నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ కొత్తగా పలు శంకుస్థాపనలు చేస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. ఉన్న అసంపూర్తి పనులకే దిక్కులేదంటే కొత్త పనులకు ఎన్నికలకు కొన్ని రోజుల ముందు హడావుడిగా కొబ్బరికాయలు కొడుతుండడంపై జనం నవ్విపోతున్నారు. తాము ఒకవేళ ఓడిపోయినా ఆ పనులకు అధికారంలో ఉన్నప్పుడే శంకుస్థాపనలు చేసేసినట్టు జనం ముందు గొప్పల కోసం ప్రయత్నాలు చేస్తుండడం విశేషం. తాజాగా అన్నవరంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, ఎంపీ గీత కలిసి స్మశానవాటిక, నాన్‌వెజ్ మార్కెట్‌ల నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేశారు. పెద్దాపురం, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ, పిఠాపురం, తుని తదితర నియోజకవర్గాల్లో కొత్తగా సీసీ రహదారులు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఆయా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు శంకుస్థాపనలు చేయడం విశేషం. ఎన్నికలకు ముందు ఇలాంటి శంకుస్థాపనలతో ప్రయోజనం లేదని తెలిసినా, ఎలాంటి నిధుల మంజూరుగాని, విడుదలగాని లేకపోయినా ఓటర్లను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.



శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాల్గొని మాట్లాడుతున్న బదిలీ అయిన జేసీ

తక్షణ బదిలీ.. అర్థమేంటో..

జనసేన ఫిర్యాదుతో పశ్చిమకు బదిలీ అయిన జేసీ ప్రవీణ్ ఆదిత్య

అయినా ఆర్వో, ఏఆర్వోల శిక్షణ కార్యక్రమానికి యథావిధిగా హాజరు

ఎన్నికల నేపథ్యంలో ఆర్వోగా నియామకంపైనే అసలు వివాదం

ఇదేం విధానమంటూ సర్వత్రా విమర్శలు

కాకినాడ సిటీ, మార్చి 12 : జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యపై సోమవారం బదిలీ వేటు పడిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా పరిధిలో మూడున్నరేళ్లకు పైగా పనిచేసి నిబంధనలకు విరుద్ధంగా జేసీగా మళ్లీ కాకినాడకు రావడంతో పాటు పిఠాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కూడా నియమితులు కావడం వివాదాస్పదమైంది. దీంతో జేసీపై జనసేన లీగల్ సెల్ ప్రతినిధులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనాకు ఫిర్యాదుచేయడంతో ఆయనపై బదిలీ వేటుపడింది. ఈమేరకు జేసీని తక్షణ బదిలీచేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 536 జారీచేసింది. ఆ బదిలీ ఉత్తర్వుల్లో 'ఇమీడియట్ ఎఫెక్ట్' అని స్పష్టంగా పేర్కొన్నారు. అయినప్పటికీ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణపై రిటర్నింగ్ అధికారి (ఆర్వో), సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్వో)లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికాశుక్లా.. జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్యతో కలిసి పాల్గొనడం మరో వివాదంగా మారింది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, చెక్‌లిస్ట్, సెక్యూరిటీ డిపాజిట్, ఆర్వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు, నామినేషన్ పత్రాల పరిశీలన అంశాలపై కలెక్టర్ కృతికాశుక్లా వివరించారు. నామినేషన్ ప్రక్రియలోని వివిధ అంశాలను జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. వివాదాస్పదంగా మారిన జేసీ వ్యవహారం నేపథ్యంలో ఆయన ఏవిధంగా అవగాహన కల్పిస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నారు.

నోటిఫికేషన్ రాకుండానే మూడో ఆర్వో

ముచ్చటగా మూడో అధికారి పిఠాపురం ఎన్నికలకు రాక

పిఠాపురం, మార్చి 12: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రాకుండానే పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరోసారి మారారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ముందుగానే ఆర్వోలుగా నియమించాల్సిన అధికారుల వివరాలను జిల్లా కలెక్టరు ఎన్నికల సంఘానికి సమర్పించారు. ఆ సమయానికి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టరుగా ఇలాక్కియాను పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా నియమించారు. అయితే ఆమెను కొద్దిరోజుల కిందట పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా బదిలీచేసి అక్కడ పనిచేస్తున్న ప్రవీణ్ ఆదిత్యను కాకినాడ జిల్లా జేసీగా నియమించారు. దీంతో ఈయన కొంతకాలంగా ఆర్వోగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఈయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని రంపచోడవరం ఐటీడీఏపీవో, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా నాలుగేళ్లు పనిచేశారని, ఆయనను మళ్లీ ఇదే ఉమ్మడి జిల్లాలో జేసీగా నియమించడం, పిఠాపురం ఆర్వో బాధ్యతలు అప్పగించడం నిబంధనలకు విరుద్ధమని జనసేన నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. పిఠాపురం అసెంబ్లీ నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారనే ప్రచారం నేపథ్యంలో అధికార వైసీపీ నేతలు తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల విధుల్లో నియమించుకుంటున్నారని, ఇందులో భాగంగానే ప్రవీణ్ ఆదిత్య నియామకం జరిగిందని వారు ఆరోపించారు. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జేసీ ప్రవీణ్ ఆదిత్యను బదిలీచేశారు. ఈయన స్థానంలో పశ్చిమగోదారి జిల్లా జాయింట్ కలెక్టరుగా పనిచేస్తున్న రామసుందరరెడ్డి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టరుగా నియమితులయ్యారు. ఈయన బాధ్యతలు స్వీకరించగానే పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుంది. దీంతో ముచ్చటగా మూడో అధికారి ఆర్వోగా రానున్నారు. ఈయనయినా ఎన్నికల ముగిసే వరకూ ఉంటారా లేదా అన్నది పిఠాపురం నియోజకవర్గంలో తాజాగా చర్చనీయాంశంగా మారింది.

బదిలీ అయిన జేసీకి సత్కారం

కాకినాడ సిటీ, మార్చి 12 : జిల్లాలో సుమారు నెలన్నర రోజులు జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి పశ్చిమగోదావరి జిల్లా జేసీగా బదిలీ అయిన సీవీ ప్రవీణ్ ఆదిత్యను మంగళవారం కలెక్టరేట్‌లో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, డీఆర్వో డి.తిప్పేనాయక్, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ జె వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె సీతారామారావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఇతర అధికారులు జేసీని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జిల్లా జేసీగా బాధ్యతలు నిర్వర్తించే గొప్ప అవకాశం తనకు దక్కిందని సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

'ఆది' నుంచీ వివాదాస్పదమే!

ప్రవీణ్ ఆదిత్య పోలవరం ప్రాజెక్టు పాలకుడిగా, స్పెషల్ కలెక్టరుగా నిర్వాసితులకు ఒరిగింది శూన్యం - 7లో



నిధులు, అనుమతుల్లేకుండా శంకుస్థాపనలా

బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే వర్మ ఫిర్యాదు

పిఠాపురం, మార్చి 12: ఎటువంటి అనుమతులు, నిధులు మంజూరు లేకుండానే అధికార వైసీపీ నేతలు శంకుస్థాపనలు చేస్తున్నారని, ఇందుకు బాధ్యులైన మునిసిపల్, మండల అధికారులపై చర్యలు తీసుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు కృతికాశుక్లాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే సాగునీటి సమస్య, గ్రామాల్లో కలుషిత జలాల సరఫరా గురించి కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ టీడీపీ హయాంలో పిఠాపురంలో కాపు, బీసీ కల్యాణమండపాలకు స్థలాలు కేటాయించి, నిధులు తెచ్చి తాము శంకుస్థాపన చేశామన్నారు. ఆ శిలాఫలకాలు పగులకొట్టి ప్రభుత్వ ఉత్తర్వులు, కౌన్సిల్ అనుమతులు, ఎటువంటి నిధులు కేటాయింపు లేకుండానే ఉత్తుత్తి శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలను మోసగించి ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 7వేల ఎకరాల్లో వరిపంట సాగునీరు అందక ఎండిపోతోందని, తక్షణం సాగునీరు అందించి పంటను కాపాడాలని కోరారు. టీడీపీ నేతలు అల్లుమల్లు విజయకుమార్, సకుమళ్ల గంగాధర్‌లు పాల్గొన్నారు.



టీడీపీ-జనసేన సమన్వయ సమావేశంలో పాల్గొన్న పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు, నానాజీ

గెలుపే లక్ష్యం!

కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ-జనసేన విస్తృతస్థాయి సమావేశం

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి సత్తిబాబు, అభ్యర్థి పంతం నానాజీ

కాకినాడ రూరల్, మార్చి 12: కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన టీడీపీ-జనసేన విస్తృత స్థాయి సమావేశాన్ని కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన మంగళవారం ఇంద్రపాలెంలోని పిల్లి సత్యనారాయణమూర్తి, అనంతలక్ష్మి కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ గెలుపే లక్ష్యంగా ఇరుపార్టీల నాయకులు కార్యకర్తలు కృషిచేయాలని, అధికార వైసీపీ దుర్మార్గాలను అడ్డుకోవాలంటూ ఇరుపార్టీల నేతలు చేసిన ప్రసంగం కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపింది. అంతేకాకుండా రెండు పార్టీలకు చెందిన నాయకులు వారి మనసులో ఉన్న సందేహాలను నేతలను అడిగి నివృత్తి చేసుకున్నారు. కాకినాడ రూరల్ టీడీపీ సమన్వయకర్త పిల్లి సత్తిబాబు మాట్లాడుతూ వైసీపీ నేతలు దుర్మార్గంగా తనపై తప్పుడు ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో చేశారని, దీన్ని టీడీపీ, జనసేన కార్యకర్తలు ఖండించాలన్నారు. తాను పార్టీ మారేదిలేదని, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడిపొత్తు రాష్ట్ర అభివృద్ధికోసమేనని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తాను పోటీలో ఉన్నట్టు భావించి పంతం నానాజీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ మాట్లాడుతూ ఇరు పార్టీల కార్యకర్తలకు సమన్యాయం చేస్తానని, పిల్లి దంపతుల సలహాలు సూచనలతో తాను ఎన్నికల ప్రచారం చేస్తానని చెప్పారు. అనంతరం కాకినాడ రూరల్ టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా కష్టపడి ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీని గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జనసేన నాయకులు మట్టా ప్రకాష్‌గౌడ్, బుంగా సింహాద్రి, బొర్ల కృష్ణమోహన్, తాతపూడి రామకృష్ణ, హరి, శ్రీనివాస్, అంజిబాబు, రామలింగేశ్వరరావు, సాయిబాబు, జయకృష్ణ, శిరంగు శ్రీనివాసరావు, కడలి ఈశ్వరి, కరెడ్ల గోవిందు, రాంబాబు, మహేష్, శ్రీరాములు, మునలయ్య, తాతాజీ, వీరమహిళలు పాల్గొన్నారు.



కరప హైస్కూల్‌లో ఎంఈవో, హెచ్‌ఎంలతో చర్చిస్తున్న డీఈవో రమేష్

పీఎం ఎక్స్‌లెన్స్ అవార్డుకు 25 పాఠశాలలు నామినేట్ : డీఈవో

కరప, మార్చి12: ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్ అవార్డు కోసం జిల్లాలో 25 పాఠశాలలు ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికైన కరప జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పీఎం ఎక్స్‌లెన్స్ అవార్డుకు నామినేట్ అయిన పాఠశాలలన్నింటినీ కేంద్ర బృందం స్వయంగా పరిశీలించి ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యాప్రగతి తదితర అంశాలపై నివేదిక రూపొందించనున్నారని చెప్పారు. ఒక్కో పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులను ఎంపికచేశామన్నారు. కరప హైస్కూల్ నుంచి ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మౌలిక వసతులపై సమీక్షించారు. అనంతరం నాడు-నేడు కింద పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో పత్తి సత్యనారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.స్వర్ణరాణి, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ, మార్చి 12: రాబోయే 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చే స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికాశుక్లా అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువతపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి ఓటుహక్కు ప్రాధాన్యత తెలియపరిచేలా చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. తిప్పే నాయక్, సీపీవో పి త్రినాథ్, జిల్లా స్వీప్ అధికారి పి.విజయభాస్కర్, ఎన్నికల డీటీ ఎం.జగన్నాథం, కాకినాడ డివిజనల్ పీఆర్వో పి.రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్ -2024కు దరఖాస్తుల స్వీకరణ

రెండో 'వందేభారత్' పరుగులు

ట్రైల్ రన్‌లో భాగంగా సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లిన రైలు

13న విశాఖ నుంచి, 15న సికింద్రాబాద్ నుంచి రాకపోకలు

- 7లో

ఏపీఈఏపీసెట్ -2024కు
దరఖాస్తుల స్వీకరణ

● ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు



జేఎన్టీయూకే, మార్చి12: రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్,అగ్రికల్చర్, ఫార్మసీకామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్) -2024 నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసినట్లు ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. దీనికి సంబంధించిన దరఖాస్తులను మంగళవారం నుంచి స్వీకరిస్తున్నామన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 15 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మే13 నుంచి 19 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తామని ఏపీలో 47, హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్, సికింద్రాబాద్‌లలో రెండు కేంద్రాలు, మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. https://cets/apsche.ap.gov.in/ EAPCET_HomePage.aspx లింక్ ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులను పూరించాలన్నారు. ఇంజనీరింగ్‌కు సంబంధించి మే13 నుంచి 16 వరకూ, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు మే17 నుంచి 19 వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రూ.500 అపరాధరుసుముతో ఏప్రిల్ 30వరకూ, రూ.1000తో మే 5వరకూ, రూ.5000 అపరాధ రుసుముతో మే10, రూ.10,000 అపరాధరుసుముతో మే12 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్షలను ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకూ రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ కె.వెంకటరెడ్డితెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 08842359599, 2342499 లో సంప్రదించాలని సూచించారు.

జాబ్ ఫెస్ట్‌లతో
ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ శోభారాణి



జాబ్ ఫెస్ట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శోభారాణి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 12 : విద్యార్థులకు డిగ్రీ పట్టాను అందించడమే కాకుండా వారిని ఉద్యోగస్థులుగా చేసి పంపించాలనే లక్ష్యంతో జాబ్ ఫెస్ట్ ఏర్పాటు చేసినట్లు జోన్ -1, జోన్- 2 కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సీఈ బి.శోభారాణి చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జాబ్‌ఫెస్ట్-2024 నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ జాబ్‌ఫెస్ట్‌కు 10 నోడల్ రిసోర్సు సెంటర్ల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, ఐటీ మొదలైన రంగాలకు చెందిన 24 కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు. 269 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఎన్‌ఆర్‌సీ కో ఆర్డినేటర్ తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీఎస్‌ఎస్‌డీసీ, నోడల్ రిసోర్సు సెంటర్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ ఫెస్ట్‌లో ఆయా సంస్థల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆది' నుంచీ వివాదాస్పదమే!

● పోలవరం ప్రాజెక్టు పాలకుడిగా, స్పెషల్ కలెక్టరుగా నిర్వాసితులకు ఒరిగింది శూన్యం

రంపచోడవరం, మార్చి 12 : ఆయన ఓ అఖిల భారత సర్వీసుల అధికారి. ప్రభుత్వ నిబంధనల మేరకు రాగద్వేషాలకు అతీతంగా ప్రజాప్రయోజనాల కోసం అందరినీ గౌరవిస్తూ బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రజాసేవకుడిగా మంచి పేరు తెచ్చుకోవాల్సిన ఆయన వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సీవీ ప్రవీణ్ ఆదిత్యను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం సోమవారం పశ్చిమగోదావరి జేసీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మూడున్నరేళ్లకుపైగా పనిచేసిన ఆయనను పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా నియమించారు. దీంతో అక్కడి జనసేన పార్టీ నాయకులు నేరుగా ఎన్నికల కమిషన్‌కు ఈ విషయాన్ని ఫిర్యాదుచేశారు. ఈయన నియామకం ద్వారా ఎన్నికల సమయంలో ఆయన్ను అనుకూలంగా వాడుకోవాలని ప్రణాళిక వేసినట్టు జనసేన ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఆయనపై బదిలీ వేటు పడింది. వాస్తవానికి ప్రవీణ్ ఆదిత్య పూర్తిగా వైసీపీ అనుకూల అధికారిగా ఎప్పటినుంచో ముద్రపడింది. రంపచోడవరం సబ్ కలెక్టరుగా ప్రస్థానాన్ని మొదలు పెట్టి, తర్వాత రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పదోన్నతి పొంది, తర్వాత కాలంలో జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు పరిపాలకుడిగా చేరి, భూసేకరణకు స్పెషల్ కలెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆయా సమయాల్లో కూడా వివాదాస్పద వైఖరినే అవలంబించారనే ఆరోపణలు వచ్చాయి. జాతీయ హోదాతో ఉన్న పోలవరం ప్రాజెక్టుకు పాలకుడిగా వ్యవహరించిన కాలంలో నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసాన్ని కల్పించకుండా గ్రామాలను ఖాళీ చేయించి ప్రభుత్వ మెప్పు పొందడానికి తాపత్రయపడ్డారని పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. గిరిజన నిర్వాసితులకు భూమికి బదులుగా భూమిని సమకూర్చకుండానే గ్రామాలను ఖాళీ చేయించిన వైనం, పునరావాసం కోసం భూములను సేకరించే ప్రక్రియ చేపట్టి వారి నుంచి అప్పనంగానే భూములను కాజేసి మెప్పు పొందే క్రమంలో భూయజమానులపై తప్పుడు కేసులు బనాయించడం, గిరిజనేతర నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించకుండానే వారిని మైదాన ప్రాంతాలకు తరలించడమే కాకుండా వారి ఓట్లు మైదాన ప్రాంతానికి తరలిపోయే పరిస్థితికి కారణమయ్యారని ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఇప్పటికే పునరావాస వైఫల్యాలపై ఎన్నో ఉద్యమాలు, కోర్టు కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఇక రంపచోడవరం ఐటీడీఏలో విధులు నిర్వర్తిస్తున్న కాలంలో తెలుగుదేశానికి చెందిన ఓ గిరిజన మహిళా మాజీ ఎమ్మెల్యేను కింద కూర్చోబెట్టడం, ముఖ్యమంత్రి మెచ్చిన ఓ దివ్యాంగుడైన ఉత్తమ అధికారిని సైతం దూషించి అవమానించడం వంటి తీరు ఆయనను వివాదాస్పదుడిగా చూపుతున్నా ప్రభుత్వం ఆయనకు అండగా నిలిచింది. ఆ కారణంగానే మూడున్నరేళ్లకుపైగా ఈయన ఒకే జిల్లాలో కొనసాగారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు.

చోరీలకు పాల్పడుతున్న
అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రమోద్

పిఠాపురం, మార్చి 12: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను కాకినాడజిల్లాలో పిఠాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్‌లు మంగళవారం సాయంత్రం వెల్లడించారు. పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామానికి చెందిన పలకా అశోక్‌కుమార్ కలెక్షన్ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో కలెక్షన్ చేయగా వచ్చిన మొత్తం రూ.1.80లక్షలను మోటార్‌సైకిల్ డిక్కీలో పెట్టుకుని మెయిన్‌రోడ్డులో గల వరలక్ష్మి కట్‌పీసెస్ షాపువద్ద పార్కుచేసి మేడమీదకు వెళ్లి వచ్చి చూసుకునే సరికి డిక్కీ తెరిచి ఉండగా నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. మార్చి 1వ తేదీన జరిగిన ఈ సంఘటనపై కేసు నమోదుచేసి కాకినాడ ఐటీ కోర్ టీమ్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలోని క్రైమ్ సిబ్బంది అందించిన సహకారంతో అడిషనల్ ఎస్‌ఐ వెంకటేష్ నిందితులను గుర్తించారు. మంగళవారం జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఏజెన్సీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాకిరెడ్డి కృష్ణ(బాలకృష్ణ), మేకల హరికిరణ్(పండు)లను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.1.04లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో గండేపల్లి, గొల్లప్రోలు, ఏలేశ్వరం పోలీసుస్టేషన్లతోపాటు తెలంగాణాలోని మహబూబాబాద్ పరిధిలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

బంగారు వస్తువులు
దొంగిలించిన యువకుల అరెస్టు



బంగారు గొలుసు దొంగల చాయాచిత్రం

ముమ్మిడివరం, మార్చి 12: మహిళ మెడలో బంగారు గొలుసును దొంగిలించుకుపోయిన ఇద్దరు యువకులను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. గత నెల 28న బందరుపాలేనికి చెందిన కోళ్ల సత్యవతి కొత్తలంక వివాహ కార్యక్రమానికి వెళ్లేందుకు రోడ్డు పక్కన నిరీక్షిస్తుండగా మోటారుసైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. మహిళ ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా గాలించగా కాట్రేనికోన మండలం గచ్చకాయలపొరకు చెందిన పొన్నమండ సుబ్బరాజు, గాడి శివనాగరాజులుగా గుర్తించి వారిని ముమ్మిడివరం ల్యాంపు కళాశాల సమీపంలో మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

నేడు భీమేశ్వరాయంలో హుండీల లెక్కింపు

సామర్లకోట, మార్చి 12: కాకినాడజిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం భక్తుల సమక్షంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 6నుంచి సోమవారంరాత్రి వరకూ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు హుండీల ద్వారా వేసిన కానుకలు, పూజా రుసుముల ద్వారా వచ్చిన ఆదాయాలను బుధవారం లెక్కించనున్నట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

యానాం, మార్చి 12: యానాం నియోజకవర్గంలో ఒక గ్రామానికి చెందిన బాలికను వివాహం చేసుకున్న యువకుడిపై కిడ్నాప్, బాల్య వివాహచట్టం, పోక్సో చట్టం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మురుగానందం తెలిపారు. పాఠశాలలో చదువుతున్న బాలికను తిరుపతి తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. తర్వాత వారు కాకినాడ చేరుకోగా అదుపులోకి తీసుకుని యానాం తీసుకువచ్చి వైద్యపరీక్షలు జరిపించి, పోక్సో తదితర సెక్షన్లకింద యువకుడిపై కేసు నమోదు చేశారు. యానాం సబ్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించా రు. మంగళవారం పుదుచ్చేరిలోని కాలాపేట సెంట్రల్ జైలుకు తరలించారు.

అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు

గండేపల్లి, మార్చి 12: కాకినాడజిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ జాతీయరహదారిపై కట్టుదిట్టమైన, పటిష్టమైన భద్రతతో కలిగిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును ఏర్పాటుచేసినట్లు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఉత్తర్వుల ప్రకారం గండేపల్లి ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది సహాయంతో చెక్‌పోస్టు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కాకినాడ జిల్లాకు సరిహద్దుగా మురారిలో ఏర్పాటు చేశామని సీఐ లక్ష్మణరావు వివరించారు. 24గంటలు నిరంతరం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తుంటారన్నారు.



మురారి హైవేపై అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటుచేసిన దృశ్యం

కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి
శివరాత్రి ఆదాయం రూ.10,43,545



ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కె.గంగవరం, మార్చి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి శ్రీఛాయాసోమేశ్వర స్వామి ఆలయానికి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.10,43,545 ఆదాయం వచ్చింది. దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.5,70, 440, విరాళాలు ద్వారా రూ.55,400, హుండీల ద్వారా రూ.4,17,705 వచ్చినట్లు ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్ ప్రసాద్, ఈవో ఎం.శ్రీదేవి తెలిపారు. ట్రస్టుబోర్డు చైర్మన్ పిల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు సమక్షంలో కానుకలను లెక్కించారు.

వైభవంగా వీరేశ్వరుని రథోత్సవం



మురమళ్ళ వీధుల్లో ఊరేగుతున్న వీరేశ్వరస్వామి.

ఐ.పోలవరం, మార్చి 12: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆసీనులైన వీరేశ్వరస్వామి మురమళ్ళ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కేరళ డప్పు వాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణ, బుట్టబొమ్మల ఆటపాటలు, మిరుమిట్లుగొలిపే బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు జరిగింది. ఆలయం నుంచి మురమళ్ళ పుష్కరఘాట్ వరకు స్వామి వారి ఊరేగింపు జరిగింది. పుష్కరఘాట్‌వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, దాట్ల ఇంద్రరాజు, సర్పంచ్ కాలే రాజబాబు, కొలిశెట్టి గంగబాబు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు

కనుల పండువగా తెప్పోత్సవం

● గోదావరిమాతకు పంచహారతులు
● శివనామ స్మరణతో మార్మోగిన గోదావరి తీరం



వృద్ధగౌతమీనదిలో హంసవాహనంపై స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారంరాత్రి మురమళ్ళ భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి తెప్పోత్సవం కన్నులపండవగా జరిగింది. పవిత్ర వృద్ధగౌతమీనదిలో హంసవాహనంపై ఆసీనులై వీరేశ్వరస్వామి నదీ విహారం చేశారు. స్వామి తెప్పోత్సవం కనులారా తిలకించిన భక్తులు శివనామస్మరణంతో పులకించారు. తొలుత ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు, పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు దంపతులు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గోదావరి మాతకు పంచహారతుల కార్యక్రమం జరిగింది.

దుర్గాడలో శ్రీపుష్పయాగం



దుర్గాడ శివాలయంలో శ్రీపుష్పయాగం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం, పాల్గొన్న భక్తులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 12: కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు త్రిశూలస్నానం చేయించి శ్రీపుష్పయాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు దంపత దాంబూలాలు అందజేశారు. అంతకు ముందు భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విధుల్లో పోలీసులు అప్రమత్తత

● ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లు సురక్షితం
● రూ.81 వేల నగదుతో అప్పగింత



బ్యాగ్‌ని, అందులోని నగదును అందజేస్తున్న సీఐ శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషనులో రెండు బ్యాగులను మరిచిపోయి వెళ్లిపోయిన ప్రయాణికుడికి టూటౌన్ పోలీసులు సురక్షితంగా వాటిని అందజేశారు. కపిలేశ్వరపురానికి చెందిన ఏడ్నూతుల వెంకటరమణ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కాశీ నుంచి రాజమహేంద్రవరం రైలులో వచ్చారు. కపిలేశ్వరపురం వెళ్లడానికి కారు ఎక్కే క్రమంలో రెండు బ్యాగ్‌లను మెయిన్‌గేటు వద్ద ఆదమరుపుగా వదిలి వెళ్లిపోయారు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు వాటి గురించి ఆరా తీయగా ఫలితం లేకపోయింది. దీంతో వాటిని స్టేషనుకు తీసుకొచ్చి బ్యాగ్‌లను పరిశీలించి ఆధార్ కార్డు ఆధారంగా వెంకటరమణకు సమాచారం ఇచ్చారు. ఆయన టూటౌన్ స్టేషనుకు రావడంతో బ్యాగ్‌లను అప్పగించారు. ఓ బ్యాగ్‌లో రూ.81వేలు ఉన్నాయని, పోలీసుల దయవల్ల ఆ నగదు సురక్షితంగా దక్కిందని బాధితుడు పేర్కొన్నాడు. సీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా విధుల్లో నిబద్ధత చూపిన సీఐ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

నేటి నుంచి కొవ్వూరులో 2 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

కొవ్వూరు, మార్చి 12: ఈ నెల 13వ తేదీ నుంచి కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొత్తగా రెండు రైళ్లకు ప్రయోగాత్మక పరిశీలన కోసం హాల్ట్ కల్పిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. 17479-17480 తిరుపతి - పూరి ఎక్స్‌ప్రెస్, 17481-17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు బుధవారం నుంచి కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆపనున్నారు. 17480 తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05గంటలకు, 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. అలాగే 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9-02గంటలకు, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10-05గంటలకు కొవ్వూరు చేరుకుంటుంది. కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు.

బాలికను వేధించిన కేసులో
యువకుడికి ఏడేళ్ల జైలు

అంబాజీపేట, మార్చి 12: బాలికను ప్రేమపేరుతో వేధించడంతో పాటు ఆ బాలిక ఫొటోలు మార్ఫింగ్ చేసి చంపుతానని బెదిరించిన యువకుడికి ఏడేళ్ల జైలు, రూ.11వేలు జరిమానాను కాకినాడ కోర్టు విధించిందని ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు. అంబాజీపేట మండలానికి చెందిన బాలికను చప్పిడి అర్జున్ వేధిస్తూ చంపేస్తానని బెదిరించడంతో 2020 జూలైలో ఆ బాలిక నిందితుడిపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ షేక్ జానీబాషా ఆ యువకుడిపై పోక్సో చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాకినాడ కోర్టులో స్పీడ్ ట్రయిల్ నిర్వహించారు. ఈకేసులో పీపీ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరపు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు నిందితుడికి ఏడేళ్ల జైలు, రూ.11వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసు దర్యాప్తులో కృషిచేసిన అప్పటి ఎస్‌ఐ షేక్ జానీబాషా, ట్రయల్‌లో కృషిచేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో..
రాయపూడి శ్రీనివాస్ ప్యానెల్ విజయం

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ గోదావరి డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ ఎన్నికల్లో రాయపూడి శ్రీనివాస్(ప్రవీణ్ శ్రీను) ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించగా పోలైన 1200 ఓట్లలో శ్రీనివాస్ ప్యానెల్ అత్యధిక ఓట్లు సాధించిందని, ఈ కమిటీ 2024-2027 కాలానికి పదవిలో ఉంటుందని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలతో రాయపూడి ప్యానెల్

రెండో వందేభారత్ పరుగులు



రాజమహేంద్రవరంలో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో వందేభారత్ రైలువద్ద ప్రయాణికుల సందడి

రాజమహేంద్రవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్ రైలు ట్రైల్ రన్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.50గంటలకు రాజమహేంద్రవరం రైల్వేస్టేషనుకు చేరుకొంది. రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు ఘన స్వాగతం పలికారు. రైలులో ట్రైల్ రన్ ఈవెంట్ సమన్వయాధికారి, విజయవాడ డీఈఎన్ ఎస్.రవికుమార్ వచ్చారు. ఈ రైలు 20708 నంబరుతో ఈనెల 13న విశాఖ నుంచి, 20707 ఈనెల 15న సికింద్రాబాద్ నుంచి ప్రతిరోజూ 8 బోగీలతో పరుగులు పెట్టనుంది. అన్నీ రిజర్వేషను బోగీలతో నడిచే ఈ రైలు ఉదయం 11గంటలకు (విశాఖవైపు), సాయంత్రం 4.38కి (సికింద్రాబాద్) రాజమండ్రి చేరుకుంటుంది. అలాగే సామర్లకోట ఉదయం 11.43గంటలకు, సాయంత్రం 4.03గంటలకు చేరుతుంది. వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోటలో ఆగుతుంది. అంతకు ముందు రాజమండ్రి రైల్వేస్టేషనులో ఏర్పాటుచేసిన వన్‌స్టేషన్- వన్‌ప్రొడక్టు స్టాల్‌ని ఉదయం 9.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ ఎస్‌ఐలు మావుళ్లు, లోవరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఇప్పటికే విశాఖ నుంచి సికింద్రాబాద్‌కి ఒక వందేభారత్ రైలు నడుస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ రంగనాథ్, ఏడీఈఎన్ గణేషన్, సీసీఐ కళ్యాణ్, సీటీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

సామర్లకోటలో హాల్ట్ ఇవ్వడం అభినందనీయం: ఎంపీ

సామర్లకోట, మార్చి 12: రైల్వే చరిత్రలో అత్యంత వేగవంతమైన, సౌకర్యవంతమైన రైళ్ళు వందేభారత్ రైళ్లు అని, అన్నివర్గాల ప్రజలకు ముఖ్యంగా విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య రాకపోకలు సాగించే వందేభారత్ రైలుకు సామర్లకోట స్టేషన్లో హాల్ట్ ఇవ్వడం అభినందనీయం అని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో మంగళవారం వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ పేరిట రైల్వే ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన స్టాల్‌ను ఎంపీ గీతావిశ్వనాథ్ ప్రారంభించా రు. సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వందేభారత్ రైలు ట్రయల్ రన్‌గా సామర్లకోట మీదుగా విశాఖ వెళ్లనున్నదనే సమాచారాన్ని ఎస్ఎస్ రమేష్ ద్వారా తెలుసుకున్నారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేసేలా ఇప్పటికే కేంద్ర రైల్వే మంత్రితో పలు దఫాలు చర్చించినట్లు ఎంపీ గీతావిశ్వనాథ్ తెలిపారు. రైలు ప్రయాణీకు లకు నిరంతరం సేవలందించడంలోనూ సమాచారం అందివ్వడంలోనూ స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఎంపీ గీతావిశ్వనాథ్ రమేష్‌కు శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, బీజేపీ నాయకులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖకు రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం సామర్లకో టకు చేరుకున్న రైలుకు సామర్లకోట రైల్వే స్టేషన్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పెద్దాపురం ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితర టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. నూతన రైలు ఇంజిన్‌వద్ద లాంఛనంగా ఎమ్మెల్యే చినరాజప్ప కొబ్బరికాయకొట్టి రైలు ఎక్కి సందర్శించారు. రైలు లోకోపైలట్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు. సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, చీఫ్ కమ్మర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, నోడల్ అధికారి దేవేంద్రస్వామి, నిమ్మకాయల రంగనాగ్, సామర్లకోట బీజేపీ నాయకులు వందే భారత్ రైలును తిలకించారు.



సామర్లకోట స్టేషన్లో వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ షాపును ప్రారంభిస్తున్న ఎంపీ గీత



సామర్లకోటలో వందే భారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

కాకినాడ

నేడు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై సమావేశం

సామర్లకోట, మార్చి 12: జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పెద్దాపురం నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల్లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన కల్పించేందుకు ఈనెల 13న సాయంత్రం సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్యాంసుందర్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

'నామినేషన్ల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 12: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసు సమయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ సిటీ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతీ రాజకీయపార్టీ కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల బృందాల వెంట ఉండే వీడియో గ్రాఫర్లతో కూడా కమిషనర్ సమావేశమయ్యారు. పారదర్శకంగా బాధ్యతలు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), తుమ్మల రమేష్, బాలాజీ (టీడీపీ), పలివెల వీరబాబు (సీపీఎం), బీజేపీ, బీఎస్పీ వంటి వివిధ పార్టీల ప్రతినిధులు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డీసీపీ హరిదాసు, తహశీల్దార్ దొర, డిప్యూటీ తహశీల్దార్‌లు సీతాపతిరావు, నాయుడు పాల్గొన్నారు.

'ఎన్నికల నియమావళిని పాటించాలి'

గొల్లప్రోలు, మార్చి 12: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ కచ్చితంగా పాటించాలని గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు, మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ టీం లీడర్ టి.రవికుమార్ సూచించారు. ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు మంగళవారం నగరపంచాయతీ కార్యాలయంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎన్నికల సమయంలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివిధ రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

'వివాదాలకు దూరంగా ఉండాలి'

ఏలేశ్వరం, మార్చి 12: రాబోయే ఎన్నికల్లో వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ శేఖర్‌బాబు సూచించారు. మంగళవారం ఏలేశ్వరం ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి దిబ్బల పాలెం మీదగా నర్సీపట్నం రోడ్డులో పోలీసులు కవాతు చేస్తూ మైక్ ద్వారా వివాదాలు, అల్లర్ల జోలికి వెళ్లరాదని ప్రచారం చేశారు. బాలజీ చౌక్ సెంటర్‌లో ప్రజలకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించి ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కుంటే జరిగే నష్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుకుమార్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'నోటరీ నిబంధనను ఉపసంహరించుకోవాలి'

పిఠాపురం, మార్చి 12: ఎస్సీ కులస్థులు కుల ధృవీకరణపత్రం పొందేందుకు ఇకపై అడ్వకేట్ నోటరీ చేయించిన అఫిడవిట్‌ను సమర్పించాలని తీసుకువచ్చిన నిబంధనను ఉపసంహరించుకోవాలని పీవీరావు మాలమహానాడు ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీని వల్ల దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం పిఠాపురం తహశీల్దారు కార్యాలయంలో వినతి అందజేశారు. మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు వేళంగి వెంకటేష్, జిల్లా ప్రదాన కార్యదర్శి కొంగు నూకరాజు పాల్గొన్నారు.

'మహిళల హక్కుల పట్ల చిత్తశుద్ధి లేదు'

పెద్దాపురం, మార్చి 12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల హక్కులు, డిమాండ్ల పట్ల చిత్తశుద్ధి లేదని మహిళా సంఘాల నాయకులు దాడి బేబీ, వరలక్ష్మి, ఎస్తేరురాణీ అన్నారు. వరహాలయ్యపేటలో యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన మంగళవారం మహిళా దినోత్సవంలో వారు మాట్లాడుతూ మహిళ హక్కులు కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లావణ్య, కరక సుబ్బలక్ష్మి, పద్మ, అన్నపూర్ణ, లోవకుమారి, స్నేహలత, లోత్మ, నూకరత్నం, వసంత పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ నేత్ర నిధికి మొదటి నేత్రదానం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 12: రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్‌నజీర్‌తో ప్రారంభించబడిన లకంసాని విరీన్ మానస్ రెడ్‌క్రాస్ నేత్ర నిధి మొదటి నేత్రదాత నుంచి నేత్రాలను సేకరించిందని రెడ్‌క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ వైడి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. యానానికి చెందిన పాలెపు ఆదినారాయణ మరణానంతరం వారి కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారని ఇద్దరు అంధులకు దృష్టిని ప్రసాదించడానికి వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఆదినారాయణ కుటుంబసభ్యులను, నేత్రాలు సేకరించిన రెడ్‌క్రాస్ నేత్రనిధిని కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా శాఖాధ్యక్షులు డాక్టర్ కృతికాశుక్లా అభినందించారు. ప్రముఖ నేత్ర వైద్యులతో రెడ్‌క్రాస్ నేత్రనిధి అభివృద్ధికి ఒక కమిటీ ఏర్పాటుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. కార్నియా అంధత్వ నివారణకు నేత్రదానం చేయడానికి, నేత్రదానాన్ని ప్రోత్సహించడానికి ప్రజలు ముందుకు రావాలని రామారావు విజ్ఞప్తి చేశారు.

కాకినాడలో 'జనసేన మేము సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 12: 44వ డివిజన్ శారదాదేవి గుడిప్రాంతంలో మంగళవారం జనసేన మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు అగ్రహారపు సతీష్, ఇమ్మిడిశెట్టి రమణ, గరగా శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రీన్ టాక్స్‌తో లారీ, ఆటోల వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అట్ల సత్యనారాయణ, బడే కృష్ణ, అడబాల సత్యనారాయణ, సుంకర రామకృష్ణ, రాయవరపు వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి సీతారాం, తుమ్మలపల్లి వీరభద్రరావు, డోలంక మురళీ, అంకం రామానాయుడు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం


కాకినాడ సిటీ, మార్చి 12: సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్వీ గోపాలరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రినిటి హాస్పటల్ సౌజన్యంతో మంగళవారం స్థానిక నరసన్ననగర్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ రాజారపు మహేష్ ప్రారంభించి ప్రసంగించారు. సుమారు 500 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రినిటి హాస్పటల్ డైరెక్టర్ పేకేటి కిషోర్, హాస్పటల్ వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ ముత్యాల మురళీకృష్ణ, డాక్టర్ యాళ్ల రాజా, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు. అదే విధంగా ట్రస్ట్ చైర్మన్ రాజారపు మహేష్ రెడ్‌క్రాస్ వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు భోజన పంపిణీ నిర్వహించారు.

ఫ్యాన్లు, నిత్యావసరాల పంపిణీ

కాకినాడ రూరల్, మార్చి 12: కెనరాబ్యాంక్ ఉద్యోగుల సంఘం (సీబీఈయూ) కాకినాడ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీఎస్పీ వద్ద గల వృద్ధాశ్రమానికి, పెద్దాపురంలోని మన ఇల్లు ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లను, నిత్యావసర సరుకులను, వాటర్ డిస్పెన్సర్లను సీబీఈయూ రాష్ట్రవైస్‌చైర్మన్,సెంట్రల్ కమిటీ సభ్యురాలు పి.అరుణ చేతులమీదుగా పంపిణీ చేశారు. అరుణ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, అంతే కాకుండా యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక సేవాకార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ కమిటీ వైస్ చైర్మన్ జి.శ్రీధర్, సభ్యులు రాంబాబు, లక్ష్మి,రామకుమారి, ఉజ్వల, సూర్య, దుర్గాప్రసాద్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాంత చిత్తంతో పరీక్షలు రాయాలి'

కరప, మార్చి 12: విద్యార్థులు ప్రశాంత చిత్తంతో పరీక్షలను రాసి మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు బొండా సూర్యారావు సూచించారు. కరప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన సమావేశమై పరీక్షల సన్నద్ధతపై అవగాహన కల్పించారు. మరో వారం రోజుల్లో పది పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులు ఒత్తిడిని దరిచేరనీయకుండా ప్రణాళిక ప్ర కారం చదువుకోవాలన్నారు. ఆరోగ్య విషయాలు పాటిస్తూ పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. పరీక్షల భయాన్ని పోగొట్టుకోవడానికి యోగా, ధ్యానం ఆచరించాలన్నారు. ఎంఈవో పి.సత్యనారాయణ, హెచ్‌ఎం స్వర్ణరాణి, మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు, స్టాఫ్ సెక్రటరీ ఎం.రమేష్, సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కూనపురెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.



కరపలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సూర్యారావు

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, వి లవ్ బ్యాడ్‌బాయ్స్, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: భీమా, గామి, ప్రేమలు, బుల్లెట్ గయ్, ఆపరేషన్ వాలైంటైన్,బాబుసెంటర్ 1, దూని, బుల్లెట్

తిరుమల	:	భీమా
లక్ష్మి	:	భీమా
సీ అండ్‌సీ 1	:	గామి
సీ అండ్‌సీ 2	:	ప్రేమలు
శ్రీప్రియ	:	గామి
పద్మప్రియ	:	ప్రేమలు
సత్యగౌరి	:	గామి, ప్రేమలు
సూర్య 1	:	గామి
సూర్య 2	:	భీమా

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కొత్తపల్లి, మార్చి 12: నాగులాపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారిణి భారతీ సౌజన్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేయగా కొత్తపల్లి ఈవీపీఆర్డీకి అందాయి. సర్పంచ్ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగం మేరకు విచారణ చేపట్టడం విధితమే. దీనిలో భాగంగా సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేశారు. సుమారు 6నెలల సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ ఈవోపీఆర్డీకి తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

సాదరంగా ఆహ్వానించిన టీడీపీ నేతలు

జగ్గంపేట, మార్చి 12: స్థానిక టీడీపీ కార్యాలయంలో గండేపల్లి మండలం ఎన్టీఆర్‌రాజపురం గ్రామానికి చెందిన గండేపల్లి సొసైటీ చైర్మన్ కేతిన వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువాలతో సాదరంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ చౌదరి టీడీపీలోకి రావడంతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని, రైతులందరూ టీడీపీ వైపు చూస్తున్నారు అనడానికి నిదర్శనం కేతిన వెంకన్న చౌదరి, రైతులు టీడీపీ చేరడమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహన్‌రావు, జాస్తి వసంత్, కంటిపూడి సత్యనారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, కందుల బాబ్జి, కానుకొలను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో కాళ్ళ దొంగబాబు తనయుడు కాళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన వైసీపీ బూత్ కన్వీనర్, గ్రామ వలంటీర్ సూరిశెట్టి దుర్గారావు, వైసీపీ సీనియర్ నాయకులు ఆడారి బాబురావు, కోరాడ భీమరాజు తదితర 30 కుటుంబాలు నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. గోనేడకి చెందిన వైసీపీ ఉపాధ్యక్షులు ఆరాటం పోలీస్, గోనేడ, జగ్గంపేట చంటిపిల్లల డాక్టర్ కొండపల్లి రాంబాబు, గంగంపాలెం దాడి నరసింహమూర్తి తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ప్రతీ కార్యకర్త సైనికుడిగా పోరాడి సంకీర్ణ ప్రభుత్వం గెలుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, నీలం శ్రీను, కాళ్ల వెంకటేష్, కొత్త కొండబాబు, కుర్ల చినబాబు, కాళ్ళ తాతీలు, ఎడ్లకృష్ణ, ఎల్లపు శివరామకృష్ణపల్లా వీరబాబు ఉన్నారు.



జగ్గంపేట: టీడీపీ కండువా కప్పుతున్న నెహ్రూ



ప్రత్తిపాడు: టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

పోతులూరులో...

ప్రత్తిపాడు, మార్చి 12: మండలంలోని పోతులూరు గ్రామంలో మండల వైసీపీ కన్వీనర్ పంచాది వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ నాగులపల్లి బాబ్జి, మరో 300 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీలో చేరారు. వారికి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, శ్రేణులు ప్రభంజనంలా వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్నారని, టీడీపీ కూటమి రాబోయే ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించనుందని తెలిపారు. పార్టీలో చేరినవారిలో ఉపసర్పంచ్ బర్ల చక్రం, మాజీ ఉపసర్పంచ్ రేఖ దొరబాబు, వార్డుమెంబర్లు బుడంకాయల రాంబా బు, సిద్దా రాజా, కట్టమూరి లోవకుమారి, పసుపులేటి సత్తిబాబు, పంచాది చంటిబాబు, పంచాది బుజ్జిబాబు, రేఖా కృష్ణార్జున, సిద్దా దొరబాబు, చనిబోయిన నాగార్జున ఉన్నారు.

వాకపల్లిలో...

మండలంలోని వాకపల్లి గ్రామ వైసీపీ సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు వైసీపీకి రాజీనామా చేసి సత్యప్రభ సమక్షంలో టీడీపీలోకి చేరారు. మాజీ సర్పంచ్ మురగా రమణ, పలువురు వార్డు సభ్యులతో పాటు 150 మంది కార్యకర్తలకు సత్యప్రభ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సత్యప్రభను సర్పంచ్ నాగేశ్వరరావు గజమాలతో సత్కరించారు. టీడీపీ నేతలు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, అమరాది వెంకట్రావు, బద్దిరమణ, కురందాస్ అప్పలలరాజు, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎమ్.చామవరంలో...

రౌతులపూడి, మార్చి 12: మేరకచామవరం గ్రామానికి చెందిన 200 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ నేత, మాజీ సర్పంచ్ జేట్లా రాజా ఆధ్వర్యంలో కోట దొరబాబు, అడపా నాగేశ్వరరావు, అడపా అమ్మన్న, రాంశెట్టి దొరతో సహా 200 మంది టీడీపీలో చేరగా పార్టీ వారికి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, సర్పంచ్ నందమూరి రాజా, సింహాద్రిపెదబాబు, లాలం అప్పలనాయుడు, గుండ్రాజు దివాణం, జేట్లా రామకృష్ణ, లోండా దేవుళ్లు, లెక్కల రాము పాల్గొన్నారు.



తుని రూరల్: తొండంగి సర్పంచ్‌ని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల రామకృష్ణుడు

తేటగుంటలో...

తుని రూరల్, మార్చి 12: తేటగుంటలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో ఆయన స్వగృహంలో పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరారు. తొండంగి మండలానికి చెందిన తొండంగి గ్రామ సర్పంచ్ సోమాల ప్రసాద్, మురాల శెట్టి వెంకన్న, నేమాల బాబురావు, రావికంపాడు గ్రామానికి చెందిన సిద్దా రాంబాబు ఆధ్వర్యంలో ఏనుగుల బాబులు, వి.బుజ్జి, తోట మహాలక్ష్మి, దొరబాబులతో పాటుగా పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులకు యనమల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కొత్త, పాత వైషమ్యాలు ప్రక్కన పెట్టి గెలిపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కష్టపడి పని చేసే నాయకులను, కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, జక్కాన రాము నాయుడు, పప్పు నవీన్ తదితరులు ఉన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట, మార్చి 12: సామర్లకోటకు చెందిన పలువురు వైసీపీ నాయకులు తమ అనుచరులైన సుమారు 150 మంది కార్యకర్తలతో కలిసి మంగళవారం రాత్రి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పాత తహశీల్దార్ కా ర్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరయ్యారు. వర్రే రవి, మామిడాల కాసులు, శెట్టిబత్తుల దుర్గ, చల్లపల్లి అత్యుతరావు, సిద్దిరెడ్డి సూరిబాబు, చిక్కం బాబ్జీ, బిరు దా బాబ్జీలకు రాజప్ప టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించి అభినందించారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

వాకతిప్ప (కొత్తపల్లి), మార్చి 12: వైసీపీ పాలనలో ఎక్కడా నయాపైసా అభివృద్ధి జరగలేదని టీడీపీ రాష్ట అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. వాకతిప్పలో మంగళవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలు నిర్వహించారు. గత ఐదేళ్లలో ఎక్కడ, ఎప్పుడు, ఏ అభివృద్ధి పనులు చేపట్టారో చెప్పాలని వైసీపీ ప్రజాప్రతినిధులను వర్మ డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, నియోజకవర్గ తెలుగునాడు విద్యార్థి సంఘ అధ్యక్షుడు రావు అక్షయ్, మాజీ సర్పంచులు కరారి రాజబాబు, స్వామిరెడ్డి అప్పలరాజు, నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు పెనుమల్లు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాది రాజబాబు, మాజీ జెడ్పీటీసీ బర్ల అప్పారావు, బండి నాగేంద్ర, బత్తిన శ్రీనివాస్, గింజాలశ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం

పిఠాపురం రూరల్, మార్చి 12: బీసీల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ అధిక ప్రాధాన్యమిస్తున్నదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం మండలంలో జల్లూరులో మంగళవారం క్లస్టర్-6కు సంబంధించి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు, రాయుడు రామకృష్ణ, విశ్వనాధుల వీరభద్రరావు, పిల్లి చిన్నా, రొంగల శ్రీను, గీసాల బుజ్జి, నెక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైనికుడిలా పని చేయాలి

టీడీపీ నేతలు జ్యోతుల నెహ్రూ, నవీన్

జగ్గంపేట, మార్చి 12: ప్రతీ టీడీపీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆ పార్టీ నేతలు జ్యోతుల నెహ్రూ, నవీన్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగిన జగ్గంపేట నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరిని స్వాగతించాలని, ఎవరికీ ఉండే ప్రాధాన్యత వారికి ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో నెహ్రూ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నెహ్రూ మాట్లాడుతూ ఈ నెల 17న చిలకలూరిపేటలో జరిగే టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి సభలో నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరిస్తారని... సభకు నియోజకవర్గం నుంచి 4వేల మంది తరలివెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి'

సర్పవరం జంక్షన్, మార్చి 12: రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధితో పాటూ యువతకు భవిష్యత్తు ఉంటుందని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. వలసపాకల గంగరాజునగర్ జనసేన కార్యాలయంలో కొవ్వాడ గ్రామ సర్పంచ్ కోటిపల్లి ఉమాసతీష్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది అనుచరులు వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరెడ్ల గోవిందు, రెడ్డిపల్లి కిషోర్, దుగ్గన బాబ్జీ, పబ్బినీడి కృపారావు, మహేష్‌కుమార్,నగబత్తుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'నిరసన హక్కు కొనసాగించాలి'

కాకినాడ క్రైం మార్చి 12: కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద రాజ్యాంగ హక్కుగా ప్రజలు తమ సమస్యలను జిల్లా అధికారులకు తెలిపే నిరసన హక్కు కొనసాగించాలని కోరుతూ అఖిల పక్షం నేతలు మంగళవారం ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అఖిల పక్షం బృందం మాట్లాడుతూ ధర్నా చౌక్ వేదికగా రెండేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతున్నా నేరుగా జిల్లా అధికారులకు తమ ఆందోళనల ఉధృతి తెలియడంలేదన్నారు. అఖిల పక్ష నాయకులు దూశర్లపూడి రమణరాజు, అయితాబత్తుల రామేశ్వరావు, దువ్వా శేషుబాబ్జి, తోకల ప్రసాద్, తిరుమలశెట్టి నాగేశ్వరావు, మోర్తా రాజశేఖర్, జల్లూరు వెంకటేశ్వర్లు, పప్పు దుర్గారమేష్, రంభాల వెంకటేశ్వరావు, టి.రమణీ, చంద్రమళ్ళ పద్మావతి, పిట్టా వరప్రసాద్, నరాల శివ,తాళ్ళూరు రాజు ఉన్నారు.



ఎస్పీకి వినతి అందజేస్తున్న అఖిల పక్షం నేతలు

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

ముమ్మిడివరం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు ప్రచారం



తాళ్లరేవు: జి.వేమవరంలో దాట్ల ప్రచారం



సామర్లకోటలో రాజప్పకు మంగళహారతి

తాళ్లరేవు, మార్చి 12: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుకే సాధ్యమని, అవగాహనలేని తుగ్లక్ సీఎం జగన్‌కి ప్రజలంతా ఇంటికి పంపించాలని ముమ్మిడివరం టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, గ్రామకమిటీ అధ్యక్షుడు గండి అప్పారావుల ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి సైకిల్‌గుర్తుకి ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. చొల్లంగిపేటలో గ్రామకమిటీ అధ్యక్షుడు నరాల రాంబాబు, టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, మందాల సత్తిబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాట్ల మాట్లాడుతూ తాళ్లరేవు మండలం ఎటువంటి అభివృద్ధి లేక 20ఏళ్ల వెనుకు పోయిందన్నారు. సంక్షేమ పథకాలు ఒకచేతితో ఇచ్చి మరోచేతిలో లాగేసుకుంటున్నారని చెత్త మీద కూడా పన్నులు వసూళ్ల చేయడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చెత్తపన్ను రద్దు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ ప్రజలంతా అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించి టీడీపీకి పట్టంకడితే రాష్ట్రాభివృద్ధి ముందుకు వెళ్తుందని, ప్రజలంతా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సీకాల సత్తిబాబు, పుణ్యమంతుల శ్రీను, యర్రంనీడి అప్పలరాజు, గోవిందరాజు, గండి కృష్ణ, లోవరాజు, సింహాద్రి, మేడిశెట్టి కృష్ణ, జనసైనికులు పుణ్యమంతుల సత్తిబాబు, గండి అనీల్, అనుకూలి రాము, బండారు దొరబాబు, వీరమహిళ ముత్యాల జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే రాజప్ప ప్రచారం

సామర్లకోట, మార్చి 12: సామర్లకోటలో మంగళవారం రాత్రి పాత తహశీల్దార్ కార్యాలయం, వేణుగోపాలస్వామి ఆలయం రోడ్డు, తోటవారి వీధి తదితర ప్రాంతాల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం నూతనంగా పార్టీలోకి చేరిన నాయకులు, వారి అనుచరులతో ప్రచారం హోరెత్తింది. పలు కూడలి ప్రాంతాల్లో మహిళలు మంగళ హారతులతో రాజప్పకు స్వాగతం పలికి నుదుట కుంకుమ దిద్దారు. సామర్లకోట ముత్యం రాజబాబు ఆవరణ సభలో రాజప్ప మాట్లాడుతూ అమెరికా వీసా కల్గి ఉండి హైదరాబాద్‌లో కుటుంబంతో మకాం ఉంటూ స్థానికుడిగా ప్రచారం చేసుకోవడానికి పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దొరబాబుకు ఎంత మాత్రం అర్హత లేదని, తాను పదేళ్లుగా ఎమ్మెల్యేగా ప్రజల ఆదరాభిమానాలతో గెలిచి ఇక్కడే మకాం ఉంటున్న తనను విమర్శించడం ఎంతమాత్రం తగదని పేర్కొన్నారు. తనను స్థానికుడిని కాదంటూ తప్పుడు ప్రచారం చే స్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. అమెరికాకు వీసా జేబులో ఉంచుకుని తిరుగుతున్న సూపర్ ఎమ్మెల్యే దొరబాబు ఎప్పుడు అమెరికా వెళ్తాడో తెలియదన్నారు. దొరబాబు హామీలు, శంకుస్థాపనలు తప్ప నియోజకవ ర్గానికి చేసిందేమీ లేదని.. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోనని హెచ్చరిక చేశారు.

మనోధైర్యం నింపిన జయహో బీసీ డిక్లరేషన్

మాజీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 12: తెలుగుదేశం-జనసేన పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన జయహో బీసీ డిక్లరేషన్ అంశాలు వెనుకబడిన వర్గాల్లో మనోధైర్యం నింపాయని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. జయహో బీసీ డిక్లరేషన్ అంశాలు ప్రజలకు వివరించేందుకు టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన 4 జయహో బీసీ వాహనాలను మంగళవారం కొండబాబు జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కొండబాబు మాట్లాడుతూ బీసీ డిక్లరేష న్‌లో ఉన్న ఎన్నో అంశాలను క్లస్టర్ల వారీగా బీసీలకు వివరించేందుకు ఈ వాహనాలను ఉప యోగించుకోవాలన్నారు. టీడీపీ బీసీ జోన్-2 కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాసరావు, టీడీపీ పెరిక సాధికార సమితి రాష్ట కన్వీనర్ వనపర్తి బద్రి, సమితి కాకినాడ జిల్లా కన్వీనర్ కొమిరిశెట్టి నరసింగరావు, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు ఎంఏ తాజుద్దీన్, గదుల సాయిబాబు, ఏవీడీ మెంటారావు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గుమ్మళ్ల చిన్న, చోడిపిల్లి సతీష్, మూగు రాజు, వైదాడి శివ, ఎరిపిల్లి రాము,రాజన్న పాల్గొన్నారు.



బీసీ వాహనాలను ప్రారంభిస్తున్న కొండబాబు

పోస్టర్ ఆవిష్కరణ

విధ్వంసకర, అరాచక, దోపిడీ, భూకబ్జా, గంజాయి, డ్రగ్స్ రౌడీల పాలన నుంచి మన కాకినాడను-మనం కాపాడుకుందాం నినాదంతో టీడీపీ శ్రేణులు ముద్రించిన పోస్టర్‌ను సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆవిష్కరించారు. స్థానిక జగన్నాధపురంలోని కొండబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టీడీపీ నగర, అనుబంధ కమిటీల నాయకులు, డివిజన్ల ఇన్‌చార్జిలు హాజరయ్యారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు పలివెల రవి అనంతకుమార్, తుమ్మల రమేష్, సీకోటి అప్పలకొండ, బంగారు సత్యనారాయణ, అంబటి చిన్న, ఏవీడీ మెంటారావు, చింతలపూడి రవి, జొన్నాడ వెంకటరమణ, పాలిక నాని, పోలిపల్లి జగన్, పసగడుగుల శేషగిరిరావు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

ప్రత్తిపాడు, మార్చి 12: ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పదవికి రాజీనామా చేసిన ఉమ్మడి వెంకట్రావు భారతీయ జనతా పార్టీలోకి చేరారు. మంగళవారం విజయవాడ తరలివెళ్లి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం పురందేశ్వరికి దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీలోకి చేరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో బీజేపీ పార్టీకి తన వంతు కృషి చేస్తానని ఉమ్మిడి తెలిపారు.

గండేపల్లి, మార్చి 12: సూరంపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కుంచే వెంకటస్వామి వైసీపీ నుంచి బీజేపీలో చేరారు. గండేపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు తోరాటి వెంకన్న ఆధ్వర్యంలో జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మట్ట మంగరాజు, కామినేని జయశ్రీ, సత్తివెంకటరెడ్డి, కొత్త శ్రీనివాసరెడ్డి, అడపా దొరబాబు, పల్లా రాము, యాళ్ల విష్ణుమూర్తి, రాంబాబు, బాబురావు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

'ఇష్టంతో పాఠ్యాంశాలు నేర్చుకోవాలి'

పిఠాపురం, మార్చి 12: విద్యార్థులు ఆసక్తి, ఇష్టంతో పాఠ్యాంశాలను నేర్చుకోవాలని జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సూచించారు. పట్టణంలోని ఆదిత్య స్కూలు వార్షికోత్సవం రెండో రోజు కార్యక్రమాలను మంగళవారం రాత్రి ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా పాఠ్యాంశాలు నేర్చుకోవాలన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టరు ఎస్.శృతిరెడ్డి, ఫైర్ ఆఫీసర్ దాట్ల రామకృష్ణరాజు, ప్రిన్సిపాల్ ఆర్.విజయసారధి, వైస్‌ప్రిన్సిపాల్ మాధవి, బ్లూమింగ్ మైండ్స్ ఇన్‌చార్జి శ్రీనివాస్, కిండర్ వండర్ ఇన్‌చార్జి రేవతి పాల్గొన్నారు.

'100 రోజుల పనిదినాలు'

గండేపల్లి, మార్చి 12: ప్రభుత్వం కల్పిస్తున్న 100రోజుల పనిదినాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పీడీ వెంకటలక్ష్మి అన్నారు. సూరంపాలెంలో ఉపాధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మస్తరు తనిఖీ చేశారు. ఏపీవో గంగాభవాని తదితరులున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

తుని రూరల్, మార్చి 12: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టు నందు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, ఎంటెక్ కానీ ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఆమె స్పష్టం చేశారు.

సీపీఎం నేతల ధర్నా

తాళ్లరేవు, మార్చి 12: సీతారామపురం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద ఎలక్టోరల్ బాండ్స్ వివరాలను ప్రకటించాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పలువురు నేతలు మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నేత టేకుమూడి ఈశ్వరరావు, సీపీఎం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్స్ ఢీకొని నలుగురికి గాయాలు

గండేపల్లి, మార్చి 12: మండలంలో మల్లేపల్లి జాతీయరహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. గోనగూడెం నుంచి మల్లేపల్లికి మోటార్‌సైకిల్‌పై వస్తుండగా రాజమండ్రి నుంచి జగ్గంపేట వైపు వచ్చే మోటార్ సైకిల్ రెండు ఒకదాని వెనుక వస్తూ ఢీ కొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. గాయాలైనవారిని పోలీస్ సిబ్బంది హైవే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

సామర్లకోట, మార్చి 12: పట్టణ పరిధి మున్సిపల్ కార్యాలయం సమీపాన తోటవారి వీధికి చెందిన దువ్వా సుబ్రహ్మణ్యాన్ని గుర్తుతెలియని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పలువురు అతడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని కారు ఆచూకీ కోసం సామర్లకోట పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నీటి వృథా నివారణకు చర్యలు

ఏలేశ్వరం, మార్చి 12: పట్టణంలోని శివాలయం వీధిలో కుళాయి పైపునకు నియంత్రణ లేక నీరు వృథాగా పోతుందని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ కమిషనర్ కె.శివప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్ స్పందించి గొట్టానికి ట్యాప్ అమర్చి నీటి వృథా నివారణకు చర్యలు తీసుకున్నారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 12: రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని కొత్తపేట నగీనా మసీదు, మెయిన్ రోడ్ జామియా మసీదు, రేచెర్లపేట, జగన్నాధపురం ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

15న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

జగ్గంపేట, మార్చి 12: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 15న ఆవిష్కరిస్తున్నట్టు పులి ప్రసాద్ తెలిపారు. అంబేద్కర్ వాదులు, మేధావులు హాజరుకావాలని కోరారు.